## రెండుకూ, మూడుకూ తేడా ఎంత? ఒకటి.

అదిగో, గణితశాస్త్రవేత్తలు చేసే పెద్ద పొరపాటు ఆ ఒకటిలోనే ఉంది.

తేడా ఎంత? అని నన్నడిగితే 'సున్న' అంటాను.

ఏమంటే – మూడు పోయింది. రెండు ఉంది. మరి, లేనిది సున్న కదా?

అదొక్కటేనా?

రెండు కన్న మూడే ము దున్నది. గణిత శాస్త్రజ్ఞులు ఎంతటి మహా మేధావులు అయినా ఈ లెక్కలో కూడా పప్పులో కాలు వేస్తూనే ఉంటారు.

నన్నెవరూ అడగరు కాని అడిగితే మాత్రం ఒక సలహా ఇస్తాను—

గణిత శాస్త్రవేత్తలందరినీ ఒక్కసారిగా, ఒక్కుమ్మడిగా ప్రభుత్వపు ఆస్పత్రులలో చేర్చండి; లోకానికి మహోపకారం జరుగుతుంది.

నేను రెండు.

మూడు నా అప్ప! కాని, చెల్లెలంటే నిజానికి దగ్గరగా వుంటుందేమో?

'పలానావారు' "తమ 73 వ ఏట మృతి చెందారు" ఆమట అంటూ పత్రికలవాళ్ళు రాస్తూ వుంటారు. హాస్యాస్పదంగా లేదూ? ఎవరైనా సరే – తమ 73 వ ఏట మృతి చెందక మరొకరి 73 వ ఏట ఎలా చస్తారు? ఈ "తమ" అన్నది—

'రాసినవాళ్ళను ఏమి చేసినా పాపం లేదు' అని పిలకా గణపతిశాస్త్రిగారు వ్యాఖ్యానిస్తూ ఉండేవారు.

అందుచేత మూడు నా అప్పచెల్లెలంటే సబబుగా ఉంటుంది.

సరే.

నేను బ్రతుకుతానో, ఛస్తానో తేల్చుకొందుకుగాను నన్ను ఆ ఆస్పత్రిలో ఎ. ఎమ్. సి. లో చేర్చారా నాడు. ఒక మిత్రుడు-పుణ్యాత్ముడు, ఉన్నతుడు' ఉత్తముడు అయిన వ్యక్తి ధర్మమా అని ఆ వార్డులో అయిదు నిమిషాలలో ప్రవేశించి

# ఆస్పత్రి కథలు

# మహాప్రస్థానంలో మొదటిమెట్టు

## తూలికా భూషణ్



ఇందులో—అంటే వయసు నిర్ణయించడంలో ఒక ఇబ్బంది వుంది.

చచ్చిపోయిన మనిషికి వయసేమిటి? వయసుతో నిమిత్తం ఏమిటి?

రెండు అన్న అంకెగల బెడ్డు స్వంతం చేసుకోగలిగాను. ఈ అక్షర సంకేతాలకర్థం చెప్పలేనేమో కాని పరమార్థం చెప్పగలను.

మహాప్రస్థాన కర్మలో మొదటిమెట్టు

మహాప్రస్థానానికి మార్గాలు ఆస్పత్రులు.

అన్ని ఆస్పత్రులూ కావు. ప్రభుత్వం నడిపే ఆస్పత్రులు.

'మనిషిలో ఉండే మంచినే దర్శించాలి;

మంచినే వినాలి: మంచినే చెప్పుకోవాలి.' అనేవారు సుప్రసిద్ధ కథకులు, కీర్తిశేషులు అడివి బాపిరాజుగారు.

అంతే కాదు.

'మన సంస్కృతిలో విషాదమన్నది లేదు. అందుచేత విషాదాంత కావ్యాలకు స్థానం లేదు. సుఖాంతానికే మనం ప్రాధాన్యం ఇస్తాము. మనకు ఉన్నది ఒక్కటే. అది సుఖం' అనేవారు.

"మరి ఉత్తరరామచరిత్రం మాట ఏమిటి?' అని నపిగితే—

ప్రసంగం మళ్ళించేవారు.

ఇది నిజమైతే చావు అన్నది దుఃఖహేతువు కాదు. పెళ్ళితో సమానం.

ఇలాంటి పెళ్ళిళ్ళకు రంగస్థలాలు ప్రధానంగా ప్రభుత్వపు ఆస్పత్రులు!

ఇటీవల కొలది రోజులబాటు చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతూ ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో గడిపాను.

పునర్జన్మ సిద్ధాంతం పట్ల నమ్మకం లేకపోయినా ఒక్క మాట అంటాను—

ఆ కొలది రోజులలో పది జన్మలకు సరిపోయేటంత అనుభవం గడించాను.

—రచయిత

## అభయారణ్యం

"వన్య మృగాల్ని రక్షించండి"
ప్రభుత్వ ఆదేశం!
పదవులూ, అధికారాలూ ఇచ్చి
పూజిస్తోంది దేశం!!

— 'శిరీష'

ఎ. ఎమ్. సి లో ప్రవేశం సంపాదించడం.

ఈ మెట్టు ఎక్కగలిగితే - ఓహ్! ఎంత అదృష్టం!!-బొంది విడిచి సరాసరి కైలాసం చేరుకొనడమే.

బొందితో కైలాసం మానవులకు కాదు. పురాణపురుషులకు మాత్రం ప్రత్యేకం.

దురదృష్టవశాత్తూ ఏ కారణంచేత అయినా మొదటిమెట్టు ఎక్కలేకపోతే— ఏమని చెప్పేది?

ఎంతమంది కిరాతకుల చేతుల్లో పడి ఎన్నిపాట్లు పడాలో ఆ పరమేశ్వరునికే ఎరిక. కొట్టి, గుచ్చి, పొడిచి, తిట్టి, కోసి, రక్తం తీసి, రక్తం ఎక్కించి, లేవదీసి, పడుకోబెట్టి, ఎంత బాధపెట్టి ఎప్పుడు పరలోకానికి సంపుతారో వాళ్ళకే తెలియదు.

అదలా ఉంచితే మూడే మళ్ళీ కనుపిస్తుంది.

మూడు నాకన్న ముందుగానే ప్రాణ వాయువు పీలుస్తూ, సెలైన్ 'నరం' లోకి ఎక్కించుకొంటూ మొదటి మెట్టుమీద ఉంది.

మన వైద్యులు మన మాతృ భాషలో వైద్యం చదువుకొంటే సామాన్య మానవుడు చాలా చాలా లబ్ధి పొందుతాడు.

సిర, ధమని, నరం— ఈ మూడింటిని మన వైద్యులు ప్రభుత్వపు ఆస్పత్రులలో 'నరం' అనే ఒక్క పేరుతో పిలుస్తున్నారు.

బెడ్ నంబరు మూడు పక్క సర్వసాధారణంగా ఆస్పత్రులలో కనుపించే దృశ్యం కనుపించింది.

ఒక పూర్వ సువాసిని; ఒక ముత్తైదువు కూర్చుని లోగొంతులో ముచ్చట్లాడుకొంటున్నారు. ఒకరు వృద్ధ; ఒకరు యువతి.

ఇరువురి ముఖాల్లోను మోతాదుకు సరిపడ ఆందోళన, విచారం, భయం వున్నాయి.

నా ప్రవేశం మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తరవాత పది పదిహేను నిమిషాలకు. ఇందుకు నా రోగగ్రంథం అష్ట ఆధారం.

మూడు ఎప్పుడా వార్డు అలంకరించిందో నాకు తెలియదు.

నాకు తెలిసినదల్లా — ఆనాటికి నా మహాప్రస్థాన క్రతువు సాయంకాలం ఆరు గంటలకు ఆగిపోయిందని.

నా ప్రయాణపు ఏర్పాట్లు తత్కాలంగా నిలిచిపోగా నాలాగే నోరు తెరుచుకొని వున్న బెడ్ నంబరు మూడు మరింత శ్రద్ధతో పరిశీలించడం మొదలుపెట్టాను. మూడు తాలూకు మనుష్యుల మాటలు విందామని కొంచెం పక్కకు తిరిగాను.

నా కుడి పక్క వుంది మూడు.

నా కుడి చెవి అలంకారం మాత్రమే. అది చచ్చిపోయి రెండు దశాబ్దాలు దాటింది.

ఎడమ చెవి మాత్రమే వినగలదు.

అదయినా సగమే

మూడు తాలూకు మనుషులు అత్తా కోడళ్ళు. మూడు బంధువులు. అయినా ఆ అత్తా కోడళ్ళు తమ సంసారం గురించి, దానిలో లేని సారం గురించి, ఇతరులు ఎంతెంత దారుణంగా, అన్యాయంగా బాగు పడి సుఖపడిపోతున్నారో దానిని గురించి మాట్లాడుకొంటున్నారు.

నే నావార్డులో మొదట కుడిపాదంమోపిన అయిదుగంటలకు,నేనింక ఆరాత్రికి పరలోక గమనానికి ఏర్పాట్లు రద్దుచేసుకొన్నానని వైద్యులు నిర్ణయించిన తరవాత-మరి, ఎవరికి ఏమి అనుమానం వచ్చిందో-ఒక పుణ్యాత్ముడు అయిన వైద్యుడు హుటాహుటి మూడు దగ్గరికి వచ్చి పరీక్షించాడు. అనుమానం బలపడింది కాబోలు - తోడివారికి నివేదించాడు. సంప్రతింపులు జరిగాయి.

ఎ ఎమ్. సి. కి అప్పుడు అధికారిగా ఉన్న వైద్యునితో చెప్పడమూ, రాజు వెడలె రవితేజములరగ అన్నట్లు అతడు మందీ మార్బలంతో కదిలి రావడమూ, అందరూ మూడు గుండె నిశితంగా పరీక్షించడమూ జరిగింది—క్షణాలలో.

ఏమనిపించిందో—

'ఓపెన్ హార్టుసర్జరీ'కి ప్రత్యామ్నాయంగా మన ఆస్పత్రులలో అవలంబించే కంటి నీరు తుడిచే పద్ధతి అవలంబించి మూడు రొమ్ము-అంటే ఉజ్జాయింపుగా గుండె ఉండవలసిన ప్రదేశం—గట్టిగా మర్దనా చేశారు.

ప్రభుత్వ పశువుల డాక్టర్లు ఉపయోగించే పరిమాణంలో ఉన్న ఒక సిరింజి తెచ్చి సరాసరి గుండెలో గుచ్చి ఇంజెక్షన్ ఇచ్చారు.

కొట్టారు. కుదిపారు. కనుగుడ్లు పరీక్షించారు.

ఎట్టకేలకు ఒక నిశ్చయానికి వచ్చారు— మూడుకు గుండె లేదని.

అథవా అంతకు ముందు ఉన్నా అది ఇప్పుడు లేదని. అంటే పనిచేయడం లేదని. ఇక పని చేయదని. అందుచేత— మూడు చచ్చిపోయిందని!

ఈ సంగతి తెలియగానే మూడు తాలూకు శాల్తీలు వెంగులు నోట కుక్కుకొని, భయం భయంగా వెనుదిరిగి చూస్తూ నాటకీయంగా అక్కడినించి నిష్క్రమించాయి.

నా మహాప్రస్థాన క్రతుదర్శనాపేక్షతో విచ్చేసిన మిత్రుడొకడన్నాడు—

'చావుబ్రతుకులు తేలేది, తేల్చేది ఎ. ఎమ్. సి.లో. అలాంటి ఎ. ఎమ్. సి. లో సైతం చావు బతుకులలో ఉన్న ఒక రోగిని అయిదు గంటల సేపు ఎవ్వరూ చూడలేదంటే — భగవంతుడా! తతిమ్మా వార్డులలో రోగులగతి ఏమిటి?" అని.

దిక్కులేని వారికి ఎ. ఎమ్. సి. డాక్టర్లే దిక్కు!

